క్లుప్తంగా

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం పార్టీ సోషల్ మీడియా, విద్యార్థి, యూత్ విభాగం నాయకులతో మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తుంటే కొందరు పనిగట్టుకొని చేస్తున్నా దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన మల్లికార్జున్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000 సంవత్సరం పదో తరగతి బాల్యమిత్రులు రూ.17,500, మృతుడి పిల్లలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సత్యప్రసాద్, తోటి స్నేహితులు శ్రీనివాస్, రాజేందర్, శ్రీనివాస్, సురేష్, కృష్ణ, రాజు తదితరులున్నారు.

చల్లూరులో...

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో కౌలురైతు బొంగోని సదానందం అకాల వర్షాలతో వరి ధాన్యం మొలకెత్తిందనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందగ ఆయన కుటుంబ సభ్యులను తోటి స్నేహితులు పరామర్శించి రూ.21వేలు అందించారు. రాబోయే రోజుల్లో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఫోన్‌పోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలి


బాధితుడికి ఫోన్ అందిస్తున్న ఎస్సై

గంగాధర: ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని ఎస్సై అభిలాశ్ సూచించారు. మండల కేంద్రానికి చెందిన ముక్క లోకేశ్ ఈ నెల 8న పదివేలకు పైగా విలువ చేసే మొబైల్ పోయిందని స్టేషన్‌కు రాగా సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి గురువారం లోకేశ్‌కు ఇప్పించారు.

బీఆర్ఎస్ బేతిగల్ కార్యవర్గం ఎన్నిక

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామ బీఆర్ఎస్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొక్కిరాల శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా సిలివేరు బుచ్చయ్య, కార్యదర్శిగా ఇడుమాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా బండారి చేరాలు, కోశాధికారిగా తడిగొప్పుల సతీశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సారయ్య, రవీందర్‌రావు, రాజేశ్వర్‌రావు, రాజమౌళి తదితరులు ఉన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జోజిరెడ్డి

విద్యానగర్(కరీంనగర్): ఎండ తీవ్రతలు పెరుగుతున్న దృష్ట్యా నగరంలోని ప్రధాన కేంద్రాల్లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని పలుచోట్ల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యంరావు, జిల్లా కమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, జి.ప్రశాంత్ కుమార్, చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెద్దెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య కల్యాణోత్సవం


శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

- వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఐదేళ్లుగా కొనసాగుతున్న వైనం
- దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు

రామడుగు: పురాతన దేవాలయాన్ని దేవాలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతి ఏడాది స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తుంటారు. కాగా కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు ప్రతి ఏడాది కల్యాణోత్సవంతో పాటు స్వామివారికి నిత్యకల్యాణోత్సవం నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేశారు. 2018 సంవత్సరం శ్రీరామనవమి రోజు తర్వాత నుంచి నిత్యకల్యాణోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో నిత్య కల్యాణం జరుగుతోంది. దేవాలయాభివృద్ధి కమిటీ కావాల్సిన సౌకర్యాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దేవాలయంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఉదయం 9:30 గంటలకు కల్యాణ వేదికకు తీసుకువచ్చి దాదాపు గంటపాటు పూజా కార్యక్రమాలను నిర్వస్తారు.

ఎలాంటి చెల్లింపు లేకుండానే

నిత్య కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులు ఎలాంటి చెల్లింపు లేకుండానే కార్యక్రమానికి హాజరయ్యేలా కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. పూజకు సంబంధించి సామగ్రిని సమకూర్చుతుంది.

వైభవంగా నిర్వహిస్తున్నాం



గ్రామంలోని పురాతన దేవాలయాన్ని అభివృద్ధి చేసి ఏటా కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతోంది. ఐదేళ్ల క్రితం నుంచి నిత్య కల్యాణోత్సవం కార్యక్రమాన్ని భగవంతుని దయతో వైభవంగా కొనసాగిస్తున్నాం.

– వీర్ల ప్రభాకర్‌రావు, దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్

అందరి సహకారంతో..



దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్, సర్పంచ్ సహకారంతో బ్రహ్మోత్సవాలతో పాటుగా నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్నాం. దేవాలయాన్ని అందరి సహకారంతో చాలా కష్టపడి సర్వాంగ సుందరంగా నిర్మించాం.

– సౌమిత్రి రామానుజాచార్యులు, పండితులు

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


చిగురుమామిడి: గాగిరెడ్డిపల్లిలో కంటి పరీక్షలు చేసుకుంటున్న గ్రామస్తులు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. గురువారం మూడో వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్, కుమారస్వామి, సుశీల, కమిషనర్ సమ్మయ్య, నాయకులు ప్రతాపకృష్ణ, నరేష్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. శిబిరాన్ని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రవీందర్ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి ప్రజలందరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సీహెచ్‌వో ఎండీ సాజిద్ హుస్సేన్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్ తెలిపారు. కంటి పరీక్షల అనంతరం కళ్లద్దాలు అందిస్తున్నామని ఇప్పటివరకు 22 వేల మందికి కంటి పరీక్షలు చేసి 8వేల మందికి అద్దాలు పంపిణీ చేశామని వివరించారు.


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న రాధిక, తదితరులు

ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు.. మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ సేవా ఇస్లావత్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్లవారీగా చేపట్టనున్న శానిటేషన్ డ్రైవ్‌ను ఇన్‌స్పెక్టర్లు, జవానులు బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్పొరేటర్ల సహకారంతో డివిజన్ కమిటీ సమావేశాలు నిర్వహించుకొని, సమస్యలు గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. ఎనిమిది రోజుల పాటు ఇంటింటికీ వందశాతం చెత్త సేకరణ, సెగ్రిగేషన్, రోడ్లను శుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు ముమ్మరం చేయాలని తెలిపారు. వర్షాకాలం రానున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించాలని, పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. మేరీ లైఫ్, మేరా స్వచ్ఛశహర్ పనులు కూడా స్పెషల్ డ్రైవ్‌తో పాటు కొనసాగాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రియంభకేశ్వర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

నిరంతర అభివృద్ధి పనులతో కొత్త రూపు

నిరంతరంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులతో నగరం కొత్త రూపు సంతరించుకుంటోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం 50వ డివిజన్ గణేశ్‌నగర్‌లో రూ.52.60 లక్షలతో మూడు చోట్ల చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గతంలో గణేశ్‌నగర్ వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. చాలా రోజుల క్రితం వేసిన రోడ్లు, డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరి స్థానికులకు సమస్యగా ఉందని తెలిపారు. వాటి స్థానంలో నూతనంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ కొలిపాక అంజయ్యతో పాటు స్థానిక ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

తాటి ముంజ.. పోషకాలు నిండా

వేసవిలో చల్లదానికి దొరికే వాటిలో ముఖ్యమైనవి తాటి ముంజలు. ఇవి చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉండే ఇవి ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా ఉపయోగకరం. కొండగట్టు నుంచి వీటిని తీసుకొచ్చి కరీంనగర్‌లోని మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో నగరవాసులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. రూ.100 లకు 12నుంచి 13 తాటి ముంజలు అమ్ముతున్నట్లు కొండగట్టుకు చెందిన కరీం చెబుతున్నాడు.

– విద్యానగర్(కరీంనగర్)



'మిట్టపల్లి సురేందర్ ఆరోపణలు అర్థరహితం'

తిమ్మాపూర్: రాష్ట్ర సాంస్కృతిక సారథి, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై మిట్టపల్లి సురేందర్ ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ అన్నారు. గురువారం నుస్తులాపూర్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వ్యక్తిగత దూషణలకు దిగితే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యేను దూషిస్తే నియోజకవర్గ ప్రజలను అవమానించినట్లే అని పేర్కొన్నారు. నిత్యం మద్యం మత్తులో, సైకోలా వ్యవహరించే మిట్టపల్లి సంగతి అందరికీ తెలుసన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేస్తున్న రసమయికి, సరేందర్‌కు ఎంతో తేడా ఉందన్నారు. కళాకారుల సమస్యలు హైదరాబాద్‌లోని సారథి కార్యాలయంలో పరిష్కరించుకోవాలి తప్పా నియోజకవర్గానికి సంబంధం లేదన్నారు. సారథిలోని అంతర్గత సమస్యలకు శాసన సభ్యులకు ఏం సంబంధం, దానికి సంబంధించిన అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మతిలేని మాటలు, చేష్టలతో అభాసుపాలు కావొద్దని సూచించారు. అహంభావ మాటలను బేషరతుగా వెనక్కి తీసుకొని, ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూల్చడం అన్యాయం'


బాధితులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: ముప్పై ఏళ్లుగా నివాసముంటూ గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకొని ఇంటి పన్నులు చెల్లిస్తున్న పేదల ఇళ్లు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రేకుర్తి అంబేడ్కర్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న షేకాబీ కాలనీ బాధితులను గురువారం పరామర్శించి మాట్లాడారు. పేదల ఇళ్లు కూల్చేయమని ఎక్కడా కోర్టు పేర్కొనలేదని, మిగితా భూమి జోలికి ఎవరు రావడం లేదని ఇందులో ఏదో అదృశ్యశక్తి వెనుకాల ఉండటం వల్లనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇళ్లు కూల్చివేయబడ్డ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమద్ నవాబ్, ఎండీ చాంద్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, అస్తపురం రమేశ్, కుర్ర పోచయ్య, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్, ముక్క భాస్కర్, ముల్కల కవిత, పొరండ్ల రమేశ్, మామిడి సత్యనారాయణరెడ్డి, చంద్రయ్యగౌడ్, షాహిద్, తమ్మడి ఎజ్రా, గాదె శివరాం, షేహెన్షా, అష్రఫ్ ఖురేషి, బొబ్బిలి విక్టర్, జిలకర రమేష్, హనీఫ్, కమల్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మధుకర్

హుజూరాబాద్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి గెలవాలని బీఆర్ఎస్ 14వ వార్డు అధ్యక్షుడు గంట మధుకర్‌ముదిరాజ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి పెద్దమ్మ గుడిలో 101 కొబ్బరికాయలు కొట్టిన అనంతరం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ సదానందం గంట మధుకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గంట కొమురయ్య, కనకయ్య, సమ్మయ్య, మోహన్ రెడ్డి, గంట శ్రీధర్, బన్నీ, గంట రాజు, తులసి లక్ష్మణమూర్తి, ఎండీ ఖలీద్ హుస్సేన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మడిపల్లిలో వైద్య శిబిరం


జమ్మికుంట: పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



చొప్పదండిలో..

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) డాక్టర్ శ్రీలత హెల్త్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇటుక బట్టీల్లో నివాసం ఉండే 18 ఏళ్లలోపు పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలను గుర్తించి మందుల పంపిణీ చేశారు. సమస్య తీవ్రంగా ఉన్న పిల్లలను గుర్తించి, కరీంనగర్‌లోని డీఈఐసీ కేంద్రానికి రెఫర్ చేసి వైద్యం అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మూగల పర్శరాములు, ఆరోగ్య ఉపకేంద్రం ఏఎన్ఎం శ్రీముఖి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతికుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి, మెప్మా ఆర్పీలకు ఈసీజీ, బీపీ, షుగర్, తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఎన్నం అంజయ్య, పి.రవీందర్, కె.శ్రీధర్ రెడ్డి, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పరిమితికి మించి తరలించొద్దు


వాహనాల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డీఎం అర్పిత, ఎంవీఐ సిరాజ్ అహ్మద్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌లో గురువారం హుజూరాబాద్ ఆర్టీసీ డీఎం అర్పిత, ఎంవీఐ సిరాజ్‌అహ్మద్‌లు ప్రైవేట్ వాహనాల పత్రాలను పరిశీలించారు. మండలంలోని మొలంగూర్‌క్రాస్ , కేశవపట్నం బస్టాండ్‌లో ప్యాసింజర్ ఆటో, తదితర వాహనాలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని పలు వాహనాల యజమానులకు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ , సరైన వాహన పత్రాలు లేని డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని అర్పిత సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వీవీఆర్ రెడ్డి, జాఫర్, కుమార్, ఎస్‌కేఆర్‌రెడ్డి, భాస్కర్, రామచంద్రం ఉన్నారు.

సీసీ కెమెరాలు బహూకరణ

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామిదేవస్థానం, పోలీస్‌స్టేషన్‌కు గురువారం రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంకేఆర్ డెవలపర్స్ హైదరాబాద్ సామాజిక సేవా సంస్థ ఎండీ మాదాడి కృష్ణారెడ్డి రూ.లక్ష విలువ చేసే ఎనిమిది సీసీ కెమెరాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం వంశీధరాచార్యులు, ఎస్సై తోట తిరుపతి, ఏఎస్ఐఆర్ రవీందర్ రెడ్డి, ఆలయ ఈవో కందుల సుధాకర్, సిబ్బంది మోహన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలు అందిస్తున్న కృష్ణారెడ్డి

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కరీంనగర్: భారత రేజర్ల సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిడ్జ్ భూషణ్‌శరణ్‌సింగ్, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బేటీ బచావో బేటీ పడావో మాటలు గొప్పతనంలో ఉన్నట్లు ఆచరణలో తన బీజేపీ నాయకులు దేశంలోని మహిళలను అనేక లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. భారత రేజర్ల పోరాటానికి ప్రజానీకం మద్దతు ఇవ్వాలని తెలిపారు. బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకొని భారత రేజర్ల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మిల్కూరి వాసుదేవరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి తిరుపతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం పూజ, జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, నాయకులు అశోక్, మణికంత, మనోజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తిమ్మాపూర్‌లో పారిశుద్ధ్య పనుల తనిఖీ

తిమ్మాపూర్: ఎస్ఎస్‌జీ–2023, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో చేపట్టిన పనులను రాష్ట్ర బృందం సభ్యుడు ఎస్ఎన్.విజయరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం, సోక్‌పిట్స్, కిచెన్ గార్డెన్స్, నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్, చెత్త ట్రాక్టర్, ఇళ్లలో తడి,పొడి చెత్త వేరు చేయడం, పీపీవీ, బీపీపీవీ తదితర పనులను పరిశీలించారు. అన్ని పనులు బాగున్నాయని అభినందించారు. ప్రత్యేక అధికారి వెంట సర్పంచ్ దుండ్ర నీలమ్మ, డీపీవో వీర బుచ్చయ్య, డీఆర్డీవో శ్రీలత, డీఎల్పీవో హరికిషన్, ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి కె. మహేందర్ రావు, ఎస్‌బీఎం కిషన్‌స్వామి, రమేష్, వేణు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర బృందం సభ్యుడు